

# శారద లేఖలు

★

సౌభాగ్యవతి కల్పలత

నెచ్చెలీ!

కఠిన శిలాతలంబున పరిభ్రమించుటకంటె నిశితకంటకావృతపథంబున పురోగమించుటకంటె దారుణ సంగ్రామరంగముఖంబున వెన్నువిఱచి నిలుచుటకంటె సనాతధర్మపరాయణమై ఆచారశృంఖలానిబద్ధమై, అవిద్యాతమోగ్రస్తమై ఆరోగామయావస్థలోనున్న ప్రజానీకములో క్రొంగ్రొత్తసంస్కారమును ప్రవేశపెట్టుట అత్యంతకష్టము. ఆ సంస్కారము ప్రజాహితమైనదేయగుగాక. దయాకలితమైనదేయగుగాక, అవినీతి నివారకమేయగుగాక ప్రజలు దానికి సులభముగా సుముఖులుగారు. మఱియు నా సంస్కరణకు రెదురొడ్డి నిలిచి అసంఖ్యాకవిఘ్నంబులుగలిగించి యాప్రయత్నమును నాశమొనర్పయత్నింతురు.

శ్రీ రావుబహద్దూర్ కందుకూరి వీరేశలింగముపంతులుగారుకడచిన అర్థశతాబ్దిలో ఆంధ్రప్రజానీకముతో గావించిన పోరాటమిట్టిదే. వీరేశలింగముపంతులుగారు విద్యార్థిదశవీడి వ్యావహారికరంగమున ప్రవేశించి నలుదెసలపారజూడగనే ప్రజలలో ఘనీభవించియున్న పూర్వాచారపరత్వము, ఉద్యోగులలో పెచ్చరిల్లియున్న లంచగొండితనము, వేశ్యాస్త్రీలనుభవించుచున్న హైన్యత, బాలవితంతువులుపడుచున్న కడగండ్లు, విద్యావిహీనస్త్రీలలో వ్యాప్తమైయున్న మూఢత్వము ఆయనహృదయమునుకలంచెను. వెంటనే సంస్కరణకు పూనుకొనెను.

దైవవశమునఆయన సంస్కారప్రియుడగుటయేగాక కవి, పండితుడగుటయు ఆంధ్రులపుణ్యమేయయ్యెను. అంతదనుక కవియైనవాడెల్లకావ్యమునో, శతకమునో విరచించుటో, పురాతనసంస్కృత గ్రంథమేదేని తెనిగించుటో తక్కమరియొకపుంత ఆంధ్రకవు లెరుగకుండిరి. వీరేశలింగనుకవి కలముచేపట్టగనే తెలుగులో క్రొంగ్రొత్తబాటలెన్నో తెఱచెను. ఆంధ్రభాషకు మృదుమధురమగు వచనరచన ఆయనపెట్టినభిక్షయే. వచనములో కథలు, కావ్యములు, నవలలు, నాటకములు, వ్యాసములు, ప్రహసనములు, చరిత్రలు, శాస్త్రములు, జీవితములు, అనువాదములు, వాచకపుస్తకములు అన్నియు ఆయనవిరచించినవే. కావుననే ఆయన గద్యతిక్కనయని వ్యవహరింపబడినాడు. అటులని ఆయన పద్యరచనాధురంధరుడుకాకపోలేదు. సామాన్యపద్యకావ్యములేగాక నిర్వచననిరోష్ఠ్య ప్రబంధములుగూడ రచియించి విద్వత్కవి యనిపించుకొనినాడు. భాషావిషయమున ఆయన యెంతవిశారదుడనిపించుకొనినను, అవినీతిపరులగు నుద్యోగులతో పోరాడుటలో నెంతయోధాగ్రేసరుడనిపించుకొనినను, స్త్రీలయెడకారుణ్యమువహించి వారినివిద్యావతులను జేయుటకును, వారికడగండ్ల నున్మూలించుటకును, వారిహైన్యతను రూపుమాపుటకును, ఆయనచేసినంత తదితరములయెడ చేయలేదేమో అనిపించును. కావున ప్రాతఃస్మరణీయుడగు నామహిళాబాంధవునకు మనమహిళామండలి యెంతయైనఋణపడియున్నదని చెప్పవచ్చును. శ్రీ వీరేశలింగముపంతులుగారి జీవితములో స్త్రీ పునర్వివాహోద్యమము బలవత్తర

మైనది. ఈ మహోద్యమము సాగించుటలో ఆయన యెన్నియో కష్టనష్టములకు గురియయ్యెను. ఎందరో బలవద్విరోధుల దారుణచర్యలకు పాత్రుడయ్యెను. అయినను ఆయన యేమాత్రము జంకక, గొంకక, వెనుదీయక అనేకమంది బాలవితంతువులకు పునస్సౌభాగ్యములు కల్పించి కృతకృత్యుడైనాడు. ఆయన స్వాపతేయము నందలి విశేషభాగము ఈ బాలవితంతువుల నుద్ధరించుటకే వినియోగమైనదనుటకు యిప్పటికిని రాజమహేంద్రవరమున ఆయన ఆస్తిపై ధర్మకర్తలు నడుపుచున్న వితంతుశరణాలయమే తార్కాణ.

స్త్రీలలో విద్యావ్యాప్తి కలిగించుటకు శ్రీ వీరేశలింగము పంతులుగారు పెక్కుగ్రంథములను వ్రాసిరి. ఆయన వ్రాసిన చంద్రమతీచరిత్రము, సత్యవతీచరిత్రము ఆదిగాగలవి ఆయన స్త్రీవిద్యాభిమానమును వేనోళ్ల చాటుచున్నవి.

వేశ్యాసంఘసంస్కరణకు శ్రీ వీరేశలింగము పంతులుగారు చేసిన కృషి సాటిలేనిది. పురుషుని స్వార్థమునకును భోగలాలసతకును ఒకతెగను ప్రత్యేకించి పతితలనుగా జేయుట ఆయనకెంతయో బాధకలిగించెను. ఒకవంక వేశ్యలకు వారి నైచ్యతను తెలియబఱచి వివాహములకు ప్రోత్సహించుచు వేరొకవంక వేశ్యాలోలురైన పెద్దమనుష్యులను నిరసించుచు వారిపై ధ్వజమెత్తెను. పత్రికలలో వీరిపరువుప్రతిష్ఠలు నశించునట్లు దుయ్యబ్రాసెను. ఈ అలజడికి జడిసి వారాంగనల చేపట్టుట గౌరవప్రదమని భావించెడి పెద్దలు ఆ అకార్యమునెడ విముఖులు కాగా, తమహైన్యతను గుర్తించిన వేశ్యాంగనలనేకమంది తమవృత్తియెడ విముఖులై వివాహములు చేసికొనుటకుద్యుక్తులైరి. శ్రీ వీరేశలింగము పంతులుగారిని ఆంధ్రమహిళలు కలకాలము స్మరించుటకు ఈ మూడు మహోపకృతులే చాలును.

ఈ 1948 సంవత్సరము ఏప్రియలు పదునారవ తేదికి ఆయన తెలుగుసీమను జన్మించి నూరుసంవత్సరములు నిండును. కావున ఆయన శతవార్షికజయంతి ఆంధ్రావనియందంతటను మహోత్సాహముతో జరుపబడుచున్నది. శ్రీ పంతులుగారు మరణించి చాలకాలమైనది. అయిననేమి, ఆయన వాఙ్మయము, ఆయన మహత్తరసేవ మన దృష్టిపథముననుండి నన్నినాళ్లు ఆయన అమరుడే. మన హైందవ సంప్రదాయములో మహాపురుషులు జన్మించిన దినమును, లోకకంటకులైన వారు మరణించిన దినమును, పండువుగా భావించి వేడుకలు చేసికొను సదాచారము గలదు. ఈ ఆచారము మహోత్కృష్టమైనది. ఈ ఆచారముప్రకారమే రామ, కృష్ణాదులు జన్మించిన దినమునను, నరకాసురాదులు మరణించినదినమునను పండుగ చేసికొనుచున్నాము. మఱి మంచివారు పుట్టుట, దుర్మార్గులు నశించుట లోకమునకు పండుగేగదా.

ఈ కారణమున శ్రీ వీరేశలింగము పంతులుగారు జన్మించిన ఈ పదునారవ తేదీ మహాపర్వదినముగ భావించబడినది. ఈ శుభదినమున, ఏ మహామహుని యపారకృషివలన మన ఆంధ్రమహిళలు, ఈపాటి చదువుట, వ్రాయుట, మహిళాసభలలో పాల్గొనుట, సంఘసేవచేయుట, మహాసంస్థలలో ప్రాతినిధ్యము వహించుట ఆదిగాగలయున్నతస్థితికి రాగలిగిరో, ఆ మహనీయుడైన, మహిళాబాంధవుడైన శ్రీ వీరేశలింగము పంతులుగారిని భక్తితో స్మరించి చరితార్థలగుదురుగాక. శ్రీ వీరేశలింగం పంతులుగారికి ఇవియే నా నమోవాకములు.

ఇట్లు,
మిత్రురాలు
శారద